క్లుప్తంగా

650 పశువులకు గాలికుంటు టీకాలు



పదమాయవలసలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

బలిజిపేట: మండలంలోని పదమాయవలస, పలగర గ్రామాల్లోని 650 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శనివారం వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూగజీవాలకు వ్యాధి సోకకుండా ఈ టీకాలు వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి గణేష్ తెలిపారు. నోటి వెంట చొంగ కారడం, నాలుకపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలు గిత్తల మధ్య పుండ్లు వంటివి వ్యాధి లక్షణాలని, ఇవి కనిపించిన వెంటనే పశువైద్య కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు ఉషారాణి సూచించారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆమె వారం రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయని, అవసరాల నిమిత్తం బయటకు వెళ్లే వారు గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలన్నారు. అలాగే గ్రామాల్లో చైతన్య సదస్సు ఏర్పాటు చేసి, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ బారిన పడితే పాటించాల్సిన నియమాలు వివరించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట టెంట్లు, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు.

గోపీనాథునికి ప్రత్యేక పూజలు



గోపీనాథున్ని దర్శించుకుంటున్న భక్తులు

భామిని: లివిరిలో వెలసిన గోపీనాథ రాధాకృష్ణ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పాలు, పెరుగు, వెన్న, నెయ్యితో చేసిన పదార్థాలను నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సింగిడికి చెందిన వ్యాపారులు ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నసమారాధ చేశారు.

అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు దాతల సహకారంతో ఆలయ సిబ్బంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

విత్తనగుళికల తయారీపై అవగాహన



విత్తనగుళికల తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు రైతుభరోసా కేంద్రం పరిధిలో రైతులకు విత్తన గుళికల తయారీపై ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది శనివారం శిక్షణ ఇచ్చారు. తొలకరి వర్షాలు ప్రారంభానికి ముందు రైతులు విత్తనగుళికలు తయారు చేసుకుని పొలాల్లో వేసుకోవాలని సూచించారు. నవధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ మండల ఇన్‌చార్జ్ బి.ధనుంజయ, డివిజనల్ ఇన్‌చార్జ్ జి.అన్నపూర్ణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

పాలకొండ రూరల్: స్థానిక శ్రీశయన వీధిలో కొలువుతీరిన సత్యసాయి శివం మందిరం అభివృద్ధికి కురుపాం న్యాయమూర్తి రోహిణీరావు రూ.25వేలు విరాళం అందజేశారు. శనివారం పాలకొండ వచ్చిన ఆమె మందిరాన్ని సందర్శించారు. ఈక్రమంలో మందిరం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కమిటీ సభ్యులతో అన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం
- పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా నేతల విస్తృత ప్రచారం
- రేపు ఎన్నికల పోలింగ్

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. శనివారంతో ఈ ప్రచార పర్వం ముగియగా, ఓటర్ల ఇంటింటికీ వెళ్లిన నాయకులు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి, అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి, కరపత్రాలు పంపిణీ చేసి అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపుతో విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను చాటాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో అంతా పాల్గొని, ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



బలిజిపేట: పెదపెంకిలో సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: అప్పయ్యపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సూర్యనారాయణ



బలిజిపేట: పెద్దింపేటలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



పార్వతీపురం టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



సీతానగరం: ఓటరుకు ఓటు నమూనా పత్రం అందజేస్తున్న దృశ్యం

నేడు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

సాలూరు: ఎన్నికల నిబంధనలు అతిక్రమించకుండా వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తెలిపారు. శనివారం స్థానిక పట్టణంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని నాయకులతో సమావేశమై, ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలపై చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళికి లోబడి పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరపాలని సూచించారు. వైఎస్సార్ విగ్రహాలకు ముసుగులు వేశారని, ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని, పార్టీ జెండాలు ఎగురువేసి, కేకులు కట్ చేయాలన్నారు. అలాగే రోగులు, వృద్ధులు, అనాథలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలన, అమలు చేస్తున్న పథకాలు, ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం విషయాలను వివరించాలన్నారు. నిరంతరం పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు పూర్తి

పాలకొండ రూరల్: ఉగాది పర్వదినం రోజున పాలకొండ అర్బన్ పరిధిలోని జగనన్న కాలనీలో సామూహిక గృహ ప్రవేశాలు పెద్ద ఎత్తున చేపట్టేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హౌసింగ్ ఏఈ మాధవరావు తెలిపారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల తాజా స్థితిగతులను హౌసింగ్ అధికారులు శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించటం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు తమ కుటుంబాలతో సహా కాలనీలో తమ సొంత గృహాల్లోకి వచ్చే సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. శ్లాబ్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ, సిబ్బంది

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

బాడంగి: మరికొద్ది రోజుల్లో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్. త్రినాథరావు అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే అవకాశం కల్పించాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం గ్రాండ్‌టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో టీచర్లు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపుతో.. ఉత్తరాంధ్రుల విశాఖ రాజధాని ఆకాంక్ష చాటుదాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి, ఉత్తరాంధ్రుల విశాఖ రాజధాని ఆకాంక్షను చాటాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ నెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఓటర్లంతా పాల్గొని, ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి ప్రాధాన్యతా ఓటు సీతంరాజుకు వేసి, అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎన్నికల నియమావళి మేర ఈ నెల 12వ తేదీన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కటింగ్, పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ

పాలకొండ రూరల్:

మండలంలోని ఓని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రభు త్వం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం మార్చి 1 నుంచి ఏప్రిల్ 25 వరకు నిర్వహిస్తామని ఉపాధ్యాయులు గోగులు సూర్యనారాయణ అన్నారు. ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షకురాలు ఎం.బాల విద్యార్థినులకు తర్ఫీదు అందించారు. సమాజంలో ఆకతాయిల నుంచి, విపత్కర పరిస్థితుల్లో ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు పి.శారదాకుమారి, వెంకటరమణ, చిన్నారావు తదితరులున్నారు.



మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

బాలల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

రామభద్రపురం: బాలల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మండలంలోని బూసాయవలస కేజీబీవీ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం. దీప, మహిళా పోలీస్ ఆర్. లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామాలయ ప్రారంభోత్సవం

బాడంగి: మండలంలోని పినపెంకిలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. గ్రామపెద్దల సమక్షంలో మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

మరియమాత పాప పరిహార పాదయాత్ర

బాడంగి: మండలంలోని కోడూరులో వెలిసిన మరియమాత పాపపరిహార పాదయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మరియమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్లు బైబిల్ సారాంశాన్ని వివరించారు.

కూరగాయల పంటలపై పొగమంచు



పొగమంచు కారణంగా దిమ్మిడిజోల సమీపంలో దెబ్బతిన్న టమాటా పంట

- ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసంతో దెబ్బతింటున్న పంటలు
- పెట్టుబడులు రాక నష్టపోతున్న రైతులు

భామిని:

సాంప్రదాయ పంటలకు బదులుగా కూరగాయలు సాగు చేస్తూ రైతులు ఆదాయం పొందుతున్నారు. అయితే గత కొంతకాలంగా వాతావరణంలో వచ్చిన మార్పులతో కూరగాయ రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం దిగుబడిపై ప్రభావం చూపుతోంది. పగటి పూట అధిక ఎండలు, రాత్రిపూట పొగమంచుతో పంటలకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. పెట్టుబడికి తగిన దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. మండలంలో రైతులు మునగ, బెండ, వంగ, మిరప, క్యాబేజీ, పొట్టి చిక్కుడు, బరబటీ, కాకర, చిక్కుడు, దొండ, బీర తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం కారణంగా తేనెమంచు పురుగు, కాయతొలుచు పురుగు, రసం పీల్చే పురుగు, బూడిద తెగులు, కాయకుళ్లు తెగులు వంటివి వ్యాప్తి చెందుతున్నాయి. ఒకవైపు దిగుబడి లేక రైతులు నష్టపోతుంటే.. మారోవైపు మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరిగిపోయి వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోంది.

మంచుతో తీవ్ర నష్టాలు



అకాలంగా కురుస్తున్న పొగమంచుతో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విస్తరిస్తున్న తెగుళ్లతో సాగు పెట్టుబడులు పెరుగుతున్నాయి. దిగుబడి తగ్గిపోవడంతో సాగు ఖర్చులు కూడా రాక నష్టాలు మిగులుతున్నాయి.

– మునగవలస సూకయ్య, కూరగాయ రైతు, నేరడి–బి, భామిని

సస్యరక్షణపై అవగాహన



కాయగూరల దిగుబడిపై పొంగ మంచు ప్రభావం, పంట తెగుళ్లు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మంచు కారణంగా పంటపూత రాలిపోతోంది. దీని నివారణకు నాఫ్తాలిన్ ఎసిటిక్ ఆమ్లం 4 ఎం.ఎల్ 10లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఫార్ములా–4, ఆగ్రోమిన్ మ్యాక్స్, ఆర్కా వెజిటిబుల్ స్పెషల్ 5గ్రాములు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. – తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన అధికారి, పాలకొండ

లారీపై రైలింజిన్

రైలు ఇంజిన్ శనివారం పాలకొండ పట్టణం వచ్చింది. సుమారు 120 టైర్లు కలిగిన భారీ లారీపై రైలింజిన్‌ను ఎక్కించి పాలకొండ పట్టణం మీదుగా ఒడిశా తరలిస్తున్నారు. భారీ వాహనంపై రైలు ఇంజిన్ తరలించడాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. దాన్ని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. అయితే ఇరుకు రోడ్డులో దీన్ని తీసుకువెళ్లడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. – పాలకొండ



పాలకొండ-సీతంపేట రహదారిలో తరలిస్తున్న రైలు ఇంజిన్



పాలకొండ పట్టణంలో నిలిచిపోయిన ట్రాఫిక్

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

- విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- వేసవిలో మరింత అప్రమత్తం
- నాణ్యమైన ఉపకరణాల వినియోగంతో ప్రమాదాల నివారణ

గుమ్మలక్ష్మీపురం:

దైనందిన జీవితంలో విద్యుత్ ఎంత అవసరమో, ఆదమరిస్తే అంతకన్నా ఎక్కువ ప్రమాదాలే చోటుచేసుకుంటాయి. రోజురోజుకు పెరుగుతున్న వినియోగంతో పాటు ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోంది. వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం అధికమైంది. గృహోపకరణాలు, వైరింగ్‌లో లోపాలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా వినియోగదారులకు తెలియకుండానే నష్టం జరుగుతోంది. చిన్న చిన్నవే కదా అని ఆదమరిస్తే ఊహించని రీతిలో నష్టపోవాల్సివస్తుంది.

జాగ్రత్తలు తప్పనిసరి

విద్యుత్ వినియోగం, భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ ఉపకరణాల మరమ్మతులు, వైర్లు అతకడం తదితర పనులు సొంతంగా చేయడం ఏ మాత్రం సరైనది కాదు. పైగా చిన్న చిన్న వ్యత్యాసాల కోసం ఆలోచించి ఇళ్లలో వాడే విద్యుత్ ఉపకరణాలు, తీగలు నాసిరకమైనవి తీసుకోకపోవడం ఉత్తమం. వేసవిలో విద్యుత్ వినియోగం విషయంలో కూడా మరింత అప్రమత్తంగా ఉండాలి. తీగలు వేడెక్కే అవకాశం ఉండడంతో ఈ సమయంలో అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఐఎస్ఐ మార్కు కలిగిన విద్యుత్ ఉపకరణాలు, వైర్లను వినియోగించడం వల్ల ప్రమాదాలను కొంత వరకు అరికట్టవచ్చు. విద్యుత్ లోడ్ అంతా ఒకే ఫ్యూజుపై పడకుండా చూసుకోవడం మంచిది. ఇళ్లల్లో లోడ్ సర్క్యూట్ బ్రేకర్లు వేసుకుంటే, అధిక లోడ్ వచ్చినప్పుడు ట్రిప్ చేసి ప్రమాదాన్ని హెచ్చరిస్తాయి.



గుమ్మలక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషన్

అవగాహన లేకే అధిక ప్రమాదాలు

ఇళ్లలో పాత వైరింగ్ ప్రమాదకరంగా ఉంటే తొలగించి కొత్తవి ఏర్పాటు చేసుకోవాలి. నైపుణ్యం పొందిన ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే వైరింగ్ చేయించాలి. సరైన ఎర్త్ లేకపోతే లోడ్ అధికమైన సమయంలో కొన్ని ఉపకరణాలు విద్యుద్ఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. మూడు పిన్నులున్న ప్లగ్‌లు, సాకెట్లను మాత్రమే వినియోగించాలి. ఒకే చోట ఎక్కువ ప్లగ్‌లు వినియోగించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

– బి.ఆర్.వి.త్రినాథరావు, ఏఈ, గుమ్మలక్ష్మీపురం